# పువ్వులు

## ౧

[చైత్రమాసం. డొంకలనిండా చెట్లనిండా తీగెల నిండా బాగా విడిచిన చక్కనిపూలు. మెరిసిపోయే రంగులు. మత్తెక్కించే వాసన. చల్లనిగాలి. కొండమీద చెట్లచాటునుంచి పైకివొచ్చే ఎఱ్ఱని సూర్యబింబం. తల దువ్వుకొని చామంతిపూల దండ, గులాబిపూలు పెట్టుకొని వెళుతూన్న పద్దెనిమిదేళ్ళ అందమైన యువతి. దార్లో ఎడాపెడా అన్నీ దట్టమైన పొదలు.]

యువతి—ఎంత బాగున్నాయో ఈపూలు? తోటలో పూనొకటేనా ఇలా ఉందా? [పువ్వులన్నీ నవ్వుకుంటూ తీగెలమీద ఊగిపోతాయి]

పాపం! మనుషులు నడవని అడివి. ఇల్లాగే విడిచి ఆ తీగెలమీద అలాగే వాడిపోతాయి. ఎవరు కోసుకుంటారు వీటిని? అబ్బ! చూస్తే—ఎందుకో—ఎల్లాగో ఉంది!

పువ్వులు—మాకోసం నువ్వేమీ విచారపడనక్కర్లేదు. అల్లా ఎక్కడికేనా వెళ్ళి మరీ విచారించు.

[మొగం ఎఱ్ఱచేసుకుంటాయి]

యువతి—విచారించక్కర్లేదూ? ఎవరికోసం? మీ మంచిచెపుతున్నా కోపమే? [గుప్పునవొచ్చే వాసనపీల్చి]

అబ్బ! ఏమి సువాసన? ఉత్తిది! ఉత్తిది!! బూడిదలోపోసిన పన్నీరు. ఎవరికి కావాలి ఇక్కడ? పాపం!

పువ్వులు—మనంఅంటే ఎంత దయో! పాపం! దెయ్యంలా గుడ్లు మిటకరిస్తూ చూస్తోంది. వీలయితే పుటుక్కుపోదామని. [ఆకుల్లోంచి బాగా వొదిగించుకునిచూస్తూ అంటాయి]

కొన్నిపువ్వులు—మాకు భయంవేస్తోంది బాబూ! భయం! భయం!! [ఆకుల్లో ఒదిగిపోతాయి]

యువతి—మీకేం తెలియదు. లేకపోతే అల్లా అనరు. మిమ్మల్నిచూస్తే యింకా గుండె కంగిపోతోంది. కోసుకోనా?

పువ్వులు—చెప్పలేదూ? సంగతది. దూరంగాఉండి విచారించు! ముట్టుకోడంమాత్రం వొద్దు. మా సంగతి మాకుతెలుసు. మీ కెందుకన్నా ముకాదూ? ఇంకేమి?

యువతి—తరవాత ఎంతేనా ఆనందిస్తారు వినండి! కోయ్య కోవొద్దూ? [యెఱ్ఱనిచేతులు చాస్తుంది.]

పువ్వులు—వొద్దు! వొద్దు!! మాజోలికి రాకు!

[వొణికిపోతాయి. ఆకులు కదిలిపోతాయి. ఎండ కొంచెం బాగావొస్తుంది].

యువతి—మీకేం తెలియదు. నామాటవింటే—

పువ్వులు—అక్కర్లేదు. ఆగు! ఆగు!! ఆ మొద్దు చేతులతో మమ్మల్ని తాకకు! మారంగులు మాసిపోతాయి. మారేకులు కందిపోతాయి. హృదయంలేని మనుషులు కోసి పెట్టుకోడమేనా మా సౌందర్యానికి పరమావధి? వొద్దు!

యువతి—మనుషులు కోసుకుంటే ఈ గతేమి మాకు?

పువ్వులు—ఏమిటీ? 'మాగతా? మీరు కోసుకోనక్కర్లేదు. మీ సంబంధం మాకు మునుపేవొద్దు. భగవానుడు వి వాసనలేని వెలుగిస్తాడు మాకు. మీకు తెలియకుండా గాలి ప్రాణం పోస్తాడు మాకు. చంద్రుడు చల్లనివెన్నెల గుమ్మరిస్తాడు. మబ్బులు నీళ్ళుపోస్తాయి. భూదేవి బువ్వపెడుతుంది. దేవుడుచూసి ఆనందిస్తాడు. మాలోమేము ఆడుకుంటాము. పాడుకుంటాము మాట్లాడుకుంటాము. ఊగుతాము. మీ కేంపని?

యువతి—మీకేం తెలవదు. నా తల్లో గులాబి పూలని చామంతిపూలని అడగండిపోనీ.

[తల వెనక్కితిప్పి పూలని చూపిస్తుంది. గులాబిపూలు సిగ్గుపడతాయి. చామంతిపూలు వెలవెలపోతాయి. అడివి పువ్వులు నవ్వుకుంటాయి. గుప్పున సువాసనలు రేగుతాయి.]

పువ్వులు—మా కర్మంకూడా ఇలా కాలాలనా?

యువతి—కర్మం ఏమి? కర్మం

పువ్వులు—నూనె కారుతున్న ఆయినప జుట్టు

పొదల్లోపడి నలిగిపోడం కాదూ అదృష్టం? వొద్దు! వొద్దు!!

యువతి—మీకు తెలియదు. వినవుకూడాను.

[చెయ్యిచాచుకుని దగ్గిరికి వెళుతుంది]

పువ్వులు—ఇదిగో! ఛీకే! ఛీకే! వొద్దు! రావొద్దు! నీకుకాదూ?

యువతి—మీకింత చెప్పినా తెలియదేమిటి?

[చెయ్యి పూలమీదికి జాపుతుంది. గాజులు గల్లు మంటాయి. పువ్వులన్నీ బెదిరిపోతాయి. గొల్లుమని ఆకులలో దాగిపోతాయి. తలలోపూలు తొంగిచూస్తాయి. ఆకు ఆకుకి బాకులాంటి ఒక్కొక్క ముల్లు పైకి నిలిచి ఉంటుంది]

యువతి—అమ్మయ్యో! ఎంతంతున్నారో ముళ్లు! కదిలితే గుచ్చుకోవూ? అమ్మో! వెధవపూలు. ఈ ముళ్ళల్లోపడి ఏడవవలసినవే ఎవరికి కావాలి? ఎందుకూ పనికిరావు. [వెనక్కి వెడుతుంది ఆకుల్లోంచి పూలు పైకిచూస్తాయి. పక్కున నవ్వుతుంటాయి.]

పువ్వులు—బుగ్గలమీద ఆ ఎరుపు ఏమిటి?

[యువతి వెనక్కి తిరిగిచూశింది. కొంగు గాలికి ముళ్ళమీద తగులుతుంది. పూలు కిలాకిలా నవ్వుతుంటూ ఊగిపోతాయి]

యువతి—అబ్బ! పాడుముళ్ళు! కొంగుఅంతా చిరిగి పోయింది [ఇటు అటూ చూచి] ఎటువెళ్ళాడో? అరిచినా పలకడు.

పువ్వులు—అలావెళ్ళాడు. అల్లాగే!

[నవ్వుతూ తలలు ఆకులలోదాచుకుని తొంగి చూస్తాయి.]

యువతి—చప్పునరా? ఎటువెళ్ళావు?

[గట్టిగా అరుస్తుంది నిలబడి] [తెరపడుతుంది]

౨.

[పొదలమీద తీగెలమీద చెట్లమీద రంగులరంగుల పూలు గాలికి ఊగిపోతూఉంటాయి. పెద్ద పెద్ద చెట్ల నీడలుకూడా కదులుతుంటాయి పొదలమధ్య దారిలో యువతి వెడుతూఉంటుంది [తల్లోపూలు వెనక్కి చూస్తూఉంటాయి.]

తలలోపువ్వులు—ఎంతహాయిగా ఉంది? చక్కని గాలి. ఇక్కడ ఈపూలన్నీ ఎంత స్వేచ్ఛగాఉన్నాయి?

పొదలో కొన్నిపువ్వులు—అదేమిటి? ఆ పూలు వాడుమొగాలతో ఆ యినపతాళ్ళలో అలా నొక్కుకు పోతున్నాయి? మీకేమీ బాధగాలేదు?

తలలోపువ్వులు—బాధకాదూ? ఏం చెయ్యం? ఊళ్ళలోఉన్న మాకందరికి తప్పనిది ఈ ఉరి.

కొన్నిపువ్వులు—విడవకపోయినా బాగుండేదేమో! పాపం! మనుషులుకి దయఉండదేమో?

తలలోపువ్వులు—చాలా విలువగల కృత్రిమ హారాలు బలవంతంగా పెడతారు పెరగకమానుతుందా? ఏంచెయ్యం?

కొన్నిపువ్వులు—ఎంతచక్కని రంగులు ఎలావాడి పోయాయి? ఎలా ఊరుకుంటున్నారు?

తలలోపువ్వులు—రంగులనీళ్ళుపోసి బలవంతంగా వేసినవే ఈ రంగులుకూడా. ఎంతచేసినా సాధ్యమై నంతవరకూ మా రంగులు కనబడనీయం. మా సౌరభం పైకి రానీయం.

నల్లనిపువ్వులు—అక్కడ మీకు ఏంతోస్తుంది?

తలలోపువ్వులు—నిజమే! తోచదు. ఇక్కడకి రావాలని ఉంటుంది. కాని, ఈ గాలిలో భయంవేస్తుంది. మనుషులచేతులు తాకితేనేగాని భయంపోదు. మనుషులు చూస్తేనేగాని మాకు సంతోషంలేదు. అలవాటు ఏంచేసేది?

ఎర్రనిపువ్వులు—ఎప్పుడేనా ఇలాంటి గాలి రుచి చూచారా?

తలలోపువ్వులు—ఈ హాయిగాలిలో వొణుకు కూడా వొస్తోంది. ఎంతో కొత్తచేసింది. మీకు అల వాటు మరి.

పచ్చనిపువ్వులు—ఎందుకు మిమ్మల్నందరినీ అలా కట్టలాగ కట్టేశారు?

తలలోపువ్వులు—మాబాధ వారికెందుకు! వారి సౌకర్యానికి దారంపోసి సూదితోగుచ్చి కడతారు. జుట్టులో పెడితే ముక్కిపోతూ అలాపడి ఉండవలసిందే.

నీలిపువ్వులు—నీరసంగా ఎలాఉన్నారో! పాపం!

[నవ్వుకుంటూ ఆకులలో దాగుకుంటాయి. తలలో పువ్వులువిని సిగ్గుపడతాయి. ఏమిటో గొణుగుకుంటాయి. యువతికి ముల్లు గుచ్చుకుంటుంది. వొరిగి చూచుకుంటుంది. పండాకు డొంకమీంచి యువతి తలలో పూలమీద పడుతుంది. పైకి చూస్తాయి]

కొన్నిపువ్వులు—మరిచిపోయారూ? గుర్తుపట్టలేరూ మమ్మల్ని? ఎన్నాళ్ళయింది విడిపోయి? మనిషి లోకంలో పడ్డాక గుర్తెలావొస్తాము? ఎరగరుపాపం!

తల్లోపువ్వులు—గుర్తులేదు. ఎరగం. మనుష్యుల్లో పడితే అంతే కాస్త వంకరగాఉంటే కత్తిరిస్తారు. పొడుగయితే తెంపివేస్తారు. ముందుముందుకూడా ఆలాగే ఉండేలా చేసేస్తారు. ఎన్నో కృత్రిమపు పనులు చేస్తారు. ఎలా గాగుర్తుండడం? పూర్తిగా మరిచిపోయాము

[వింతగా చూస్తూ సిగ్గుపడతాయి].

మరికొన్ని పచ్చపూలు—అబ్బ! ఎలా నలిగిపోతున్నాయో? [చూచి ఆకుల్లో ఒదుగుతాయి].

తలలోపువ్వులు—మనలనిచూసే ఎలా నవ్వుకొంటూన్నాయో?

[సిగ్గుపడుతూ గొణుకుకొంటాయి. ఎండకి యువతి కొంగు ముసుగు వేసుకుంటుంది. లోపల పూలమాట వింటూ తీగెలమీద పూలు ఏమోఅంటూంటాయి. యువతి వెళుతూఉంటుంది. చల్లగాగాలి వీస్తూంటుంది]

[తెరపడుతుంది]

## 3

[సముద్రతీరం కెరటాలమీదనుంచి చల్లని నీటిబిందువులని తీసుకొచ్చేగాలి పొదలనిండా గాలికి ఊగిపోయే రంగులరంగుల పూలు. యువతి ఎర్రని బుగ్గలమీద కన్నీళ్లు పడుతూంటాయి. ఇరవైఏళ్ళ యువకుడు మంచి రూపసి కన్నీళ్ళు తుడుస్తూంటాడు. తలలోపూలు వాడి ఉంటాయి.]

యువతి—ఇవంతా ఎలా చిరిగిపోయిందో?

యువకుడు—పోనీలే! ఇందుకేనా?—

[బుగ్గలమీది కన్నీళ్లు తుడుస్తాడు]

యువతి—ఎంతంత ముళ్ళున్నాయనుకున్నావు?

యువకుడు—ఎందుకు వెళ్ళావు అక్కడికి?

యువతి—ఆడొంకమీద ఎంతెంత మంచిపూలున్నాయనుకున్నావు? చాలామంచివి.

యువకుడు—ఏడొంకమీద?

[యువతి రేగినజుట్టును సర్దుతూంటాడు]

యువతి—అదుగో! ఆడొంకమీద.

[డొంకకేసి చూపిస్తుంది]

యువకుడు—నన్ను పిలవకపోయావా? కోసిఇచ్చేవాణ్ణి ఎన్నిపూలనేనా.

యువతి—ఎంత అరిచాను? పలకందే నువ్వు.

యువకుడు—నే కోసిఇస్తానురా వెడదాం అక్కడికి.

[ఇద్దరూ డొంకదరికి వెళుతారు]

ఈ పువ్వులేనా? బాగున్నాయి.

యువతి—ఔను! అవే! కోసిపెట్టు!

యువకుడు—ఇవేనా? నిమిషంలో కోసిఇస్తా. వెధవముళ్ళు ఏంచేస్తాయి?

[జేబులోంచి మడతచాకు తీశాడు. ఒక వెదురుగడ కోశాడు. చాకు దానికికట్టాడు. డొంకమీద పది పూల గుత్తులుకోశాడు. పువ్వులు వలవల ఏడ్చాయి. రంగులు మాసిపోయాయి డొంకమీదిపూలు భయంపడి గొల్లున అరుస్తూ ఒకటివెనుక ఒకటి ఒదిగిపోయాయి. కొన్ని తీగెలు తెగిపోయాయి. కొన్ని నలిగిపోయాయి. మొగ్గలు రాలిపోయాయి. ఆకులు వాడిపోయాయి డొంక చిన్నపోయింది.]

యువతి—మంచివాడవు. ఎన్నిపువ్వులు కోసిపెట్టావు?

యువకుడు—మంచిపూలు. అన్నీ ముళ్ళే.

యువతి—నువ్వు ఓగుత్తితీసుకో?

[తలలో గుత్తులుపెట్టుకుంది]

యువకుడు—సముద్రంవొడ్డుకి వెడదాం? నీకు మంచిపువ్వులు కోసిపెడతాను.

[ఇద్దరూ వెళుతూఉంటారు. పువ్వులన్నీ తీగెలమీద వాడిలిపోతూ దాగుకుంటూంటాయి. సువాసన ఆగిపోతుంది.]

[తెరపడుతుంది]

—కనకదండి గోపాలకృష్ణశాస్త్రి.